సాక్షి రంగారెడ్డి

9

మంగళవారం । 23 । జనవరి । 2024


తలకొండపల్లి: వెల్జాల్‌లో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


షాబాద్: ప్రధాని మోదీ ప్రసంగాన్ని ఎల్‌ఈడీ తెరపై వీక్షిస్తున్న స్థానికులు



షాబాద్: సీతారాంపూర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వచ్చిన నాగర్‌గూడ మహిళలు


అబ్దుల్లాపూర్‌మెట్ : కవాడిపల్లిలోని శ్రీ కోదండ రామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో సీతారాములు, లక్ష్మణ, హనుమంతుడి చిత్రాలతో హైందవి అనే యువతి వేసిన ముగ్గు


హుడాకాంప్లెక్స్: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా వివిధ వేషధారణలతో సరూర్‌నగర్‌లోని జి.పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన

ఆధ్యాత్మిక ఝరి

అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం భక్తజనం పులకించిపోయింది. ఊరూ..వాడా.. వీధులన్నీ కాషాయమయం అయ్యాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల ఊరేగింపులతో హోరెత్తించారు. 'జై శ్రీరామ్' నినాదాలు మార్మోగాయి. అద్భుత ఘట్టాన్ని జనం టీవీలు, భారీస్క్రీన్లపై వీక్షించి తన్మయత్వంలో మునిగిపోయారు. ఉదయం నుంచే ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది.


మొయినాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

ఇంటర్వ్యూకు ఆహ్వానం

కందుకూరు: 108 ఈఎంఆర్‌ఐలో ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని ఆ సంస్థ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 25వ తేదీ వరకు సికింద్రాబాద్ మేడ్చల్ రోడ్డులోని దేవర్యంజల్‌లోని ఈఎంఆర్‌ఐ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపింది. బీటెక్ పూర్తయిన అభ్యర్థులు అర్హులని పేర్కొంది.

కబ్జాకు గురైన దేవాలయ భూమి స్వాధీనం


బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

షాద్‌నగర్: కబ్జాకు గురైన దేవాదాయశాఖ భూములను ఆశాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మొగిలిగిద్ద పంచాయతీ పరిధిలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయానికి షాబాద్ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ శివారులో సర్వే నంబర్ 280/1లో 4 ఎకరాల 38గుంటలు, సర్వేనంబర్ 280/2లో 5 గుంటల భూమి ఉంది. ఈ భూమి కొన్నేళ్ల క్రితం కబ్జాకు గురికావడంతో దేవాదాయశాఖ అధికారులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం కబ్జాకు గురైన భూమిని జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శేఖర్ ఆధ్వర్యంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దేవాలయ భూమిలో బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ పరిశీలకుడు మధుబాబు, ఈఓటీ శివకుమార్, అనంతగిరి ఈఓటీ నరేందర్ తదితరులు ఉన్నారు.

'పల్లె ప్రగతి'తో సత్ఫలితాలు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: పల్లె ప్రగతితో మన పల్లెలు స్వచ్ఛ గ్రామాలుగా మారాయని, ఇదంతా అందరి కృషితోనే సాధ్యమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్నోజిగూడలో స్థానిక సర్పంచ్ కాకి ఇందిర ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో నిర్మించిన జీపీ భవనాన్ని సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన పల్లె ప్రగతి ద్వారా సత్ఫలితాలు వచ్చాయన్నారు. పల్లె ప్రగతి ద్వారా ప్రస్తుత సర్పంచులు, ఎంపీటీసీల హయాంలో జరిగిన అభివృద్ధి తరతరాలకు గుర్తుండి పోతుందన్నారు. ఎవరి ఆలోచనలో లేని రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఉప సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీలు టి.ఇందిర, కాకి రాములు తదితరులు పాల్గొన్నారు.

'దక్షిణ' పరుగు

మెట్రో రెండో దశతో దక్షిణ హైదరాబాద్‌కు మహర్దశ

- పాతబస్తీకి రూట్ క్లియర్
- ఎయిర్‌పోర్టు పరిధిలో రియల్ భూమ్
- భారీగా విస్తరించనున్న నగరం
- ఇప్పటికే టౌన్‌షిప్పుల ఏర్పాటును ప్రతిపాదించిన సర్కార్



సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్‌పోర్ట్ మెట్రోకు గ్రీన్‌సిగ్నల్ పడింది. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో పాతబస్తీ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో రెండో దశ విస్తరణకు ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రస్తుతం గతంలోనే ప్రణాళికలను రూపొందించినప్పటికీ పనులు చేపట్టకుండా మిగిలిపోయిన ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల మార్గాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం తాజాగా అనుమతినిచ్చింది. ఎయిర్‌పోర్టు మెట్రో విస్తరణలో భాగంగా నాగోల్-ఎల్‌బీనగర్, ఫలక్‌నుమా-చాంద్రాయణగుట్ట వరకు మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. చాంద్రాయణగుట్ట మెట్రో జంక్షన్ నుంచి మైలార్‌దేవ్‌పల్లి, పి-7 రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైళ్లు పరుగులు తీస్తాయి. మెట్రో తొలిదశలో నాగోల్ నుంచి హైటెక్ సిటీ వరకు, అక్కడి నుంచి రాయదుర్గం వరకు మెట్రో విస్తరణ చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో నగరానికి పడమటి వైపున ఐటీ అభివృద్ధికి మెట్రో దోహదం చేసింది. ప్రస్తుతం దక్షిణం వైపు నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రో నిర్మాణం చేపట్టనున్న దృష్ట్యా దక్షిణ హైదరాబాద్ వైపు అభివృద్ధి జరిగే అవకాశం ఉందని రియల్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా నిర్మాణ రంగం ఊపందుకోనుంది. ప్రస్తుతం పడమటి వైపు ఔటర్‌కు ఇరువైపులా బహుళ అంతస్తుల భవనాలు పెద్ద ఎత్తున వినియోగంలోకి వచ్చాయి. 50 అంతస్తులకు మించిన హైరైజ్ బిల్డింగ్‌లను నిర్మించారు. అదే తరహాలో ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హైరైజ్ భవనాల నిర్మాణం జరిగే అవకాశం ఉంది.

అన్ని వర్గాలకు అందుబాటులో మెట్రో

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విదేశాలకు వెళ్లే వారిలో ఎక్కువ శాతం విద్యార్థులు, ఉద్యోగాల కోసం వెళ్లే వారే ఉన్నారు. మరోవైపు పాతబస్తీ నుంచి, తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి ఏటా వేలాది మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తరలి వెళ్తారు. ఈ ప్రయాణికులంతా జేబీఎస్, ఎంజీబీఎస్, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల నుంచి ఎయిపోర్టుకు వెళ్లేవారే ఎక్కువగా ఉంటారు. ప్రస్తుతం ప్రతిరోజు సుమారు 65 వేల మంది జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికులు ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రయాణికుల్లో 80 శాతం వరకు నగరానికి తూర్పు, ఉత్తరం, దక్షిణం వైపు నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాళ్లే ఉంటారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన రాయదుర్గం-ఎయిర్‌పోర్టుకు బదులు ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదించిన ఎంజీబీఎస్-ఎయిర్‌పోర్టు రూట్‌తో అన్ని వర్గాల ప్రజలకు మెట్రో సదుపాయం లభించనుంది. మరోవైపు ఈ కొత్త రూట్‌తో ప్రయాణికులు జూబ్లీబస్‌స్టేషన్ నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లొచ్చు. అలాగే రాయదుర్గం, అమీర్‌పేట్, ఉప్పల్, నాగోల్ మీదుగా ఎల్‌బీనగర్ నుంచి ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించేందుకు అవకాశం లభిస్తుంది. 'ఈ ప్రాజెక్టుతో ఎక్కువ మంది ప్రయాణికులకు మెట్రో రైలు సేవలు అందుబాటులో ఉంటాయని, నగరం నలుమూలల నుంచి కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని' అధికారులు పేర్కొంటున్నారు. రెండో దశలో 70 కిలోమీటర్ల మార్గంలో మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. మొత్తం ఆరు కారిడార్లలో నిర్మించనున్న రెండో దశలో ఎయిర్‌పోర్టు మెట్రోతో పాటు రాజేంద్రనగర్ నుంచి హైకోర్టు ప్రాంగణం, రాయదుర్గం నుంచి అమెరికా కాన్సులేట్, మియాపూర్ నుంచి పటాన్‌చెరు, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

రియల్ భూమ్..

ఇప్పటికే శంషాబాద్ ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పరుగులు తీస్తోంది. మెట్రో రాకతో ఈ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. భారీ లే అవుట్‌లు, హైరైజ్ బిల్డింగ్‌లు, టౌన్‌షిప్పులు పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్నాయి. చాంద్రాయణగుట్ట, పహాడీషరీఫ్, రావిర్యాల, మహేశ్వరం, కడ్తాల్, ఫార్మాసిటీ, కందుకూరు, షాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో నిర్మాణరంగం పెద్ద ఎత్తున విస్తరించనుంది. ఇప్పటికే ఔటర్‌కు అన్ని వైపులా నివాస సముదాయాలు, కాలనీలు అభివృద్ధి చెందాయి. మెట్రో రెండోదశతో మరిన్ని కొత్త ప్రాంతాలు హైదరాబాద్ మహానగరంలో కలిసిపోనున్నాయి. ఔటర్‌రింగ్‌రోడ్డుకు, రీజినల్ రింగ్‌రోడ్డుకు మధ్య నగర విస్తరణకు మెట్రో కనెక్టివిటీ దోహదం చేయనుంది.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. స్టేజీ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారిని, పూలతో అందంగా అలంకరించేందుకు ఉద్యానవన శాఖ అధికారిని ఆదేశించారు. కలెక్టరేట్‌ను, పరిసర ప్రాంతలను శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌కు, బందోబస్తుపై రాచకొండ పోలీస్ అధికారికి సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులకు.. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారి సుశీందర్ రావుకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలన్నారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా ఈ నెల 24వ తేదీ సాయంత్రం లోపు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ ప్రమీల రాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవ 'పంచాయితీ'

వివాదానికి దారితీసిన పంచాయతీ భవనం

- సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడి అరెస్టు
- పోలీస్ స్టేషన్ ఎదుట ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, నేతల ఆందోళన

కేశంపేట: నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవ వ్యవహారం చినికిచినికి గాలివానలా మారింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ వివాదానికి దారి తీసింది. పోలీసులు సర్పంచ్, ఎంపీటీసీని అరెస్టు చేయడంతో ఎంపీ, మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆర్‌ఎస్ నేతలు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేసేంత వరకు వెళ్లింది. ఈ ఘటన మండల పరిధిలోని కొత్తపేటలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది.

ఇదీ వివాదం

కొత్తపేట గ్రామంలో జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.20లక్షల వ్యయంతో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. పంచాయతీ భవనాన్ని సర్పంచ్ నవీన్‌కుమార్ నిర్మించారు. భవనాన్ని ప్రారంభించే విషయంలో పంచాయతీ రాజ్, మండల పరిషత్ అధికారులు, సర్పంచ్ మధ్య వివాదం మొదలైంది. భవనాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ నెల 26 తర్వాత సమయం ఇస్తానని చెప్పారు. ఈలోగా సర్పంచ్ మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ప్రారంభోత్సవం చేస్తే ప్రొటోకాల్ ఇబ్బందులు ఏర్పడతాయని భావించిన పంచాయతీరాజ్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకొని సర్పంచ్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేష్ యాదవ్‌ను అదుపులోకి తీసుకొని కేశంపేట పోలీస్ స్టేషన్‌కు అక్కడి నుంచి కొందుర్గు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


కొందుర్గు పోలీస్ స్టేషన్ ఎదుట ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, నాయకుల ఆందోళన

కొందుర్గు ఠాణా ఎదుట నేతల ఆందోళన

పంచాయతీ ప్రారంభోత్సవ వ్యవహారంలో వివాదం చోటు చేసుకోవడం, తమ పార్టీకి సంబంధించిన సర్పంచ్, ఎంపీటీసీని పోలీసులు అరెస్టు చేయడంతో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తోపాటు బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున కొందుర్గు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ నేతలు కావాలని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. నిబంధనల ప్రకారం భవనాన్ని ప్రారంభిస్తుంటే అధికార పార్టీ నేతలు, అధికారులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. చివరికి పోలీసులు నచ్చజెప్పడంతో బీఆర్‌ఎస్ నేతలు ఆందోళన విరమించారు. నవీన్‌కుమార్, మల్లేష్ యాదవ్‌ను పోలీసులు సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

సాహిత్య కళలను కాపాడుకోవాలి

గన్‌ఫౌండ్రీ: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న క్రమంలో సాహిత్య కళల పట్ల ఆసక్తి తగ్గుతుందని వీటిని కాపాడుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో రసమయి, సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి ఇంద్రగంటి జానకిబాలకు సుశీల నారాయణరెడ్డి సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సమాజంలో విలువల పరిరక్షణకు కవులు కళాకారుల అవసరం ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు రామాచారి శిష్యబృందం సంగీత విభావరి, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శాంతా బయోటిక్ అధినేత డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్యలతో పాటు పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు

అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆడపిల్లలపై వివక్ష రూపుమాపాలంటే కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అభిప్రాయపడ్డారు. ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ అధికారి పద్మజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆడ, మగ అనే తేడా పిలిచే పిలుపులో తప్ప చూపించే ప్రేమలో ఉండకూడదని అన్నారు. అమ్మయిలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని, బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించాలని, ప్రతి అంశంపై చర్చించే విధంగా శిక్షణ ఇవ్వాలని డీఈఓకు సూచించారు. తల్లిదండ్రులు, టీచర్లు స్నేహభావంతో ఉన్నప్పుడు అమ్మయిలు ఎదుర్కొంటున్న సమస్యలను వారితో ధైర్యంగా చెప్పగలుగుతారన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలికలు సమాజానికి మణిహారం.. బాలికలకు రక్షణ కల్పిద్దాం.. వారి బంగారు భవితకు పునాది వేద్దాం.. స్వేచ్ఛాయుత వాతావరణం, పోషకాహారం అందించి వారి అభివృద్ధికి తోడ్పడుదాం.. బాలికలను బతకనిద్దాం, చదవనిద్దాం.. 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేద్దాం.. మన వంతు సాయం అందించి బంగారు తెలంగాణకు బాటలు వేద్దామని అదనపు కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజ, సివిల్ సప్లయ్ డీఎం విజయలక్ష్మి, సూపర్‌వైజర్స్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్లు, వివిధ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు, ఎన్జీవోల అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఇతర జిల్లా అధికారులు, విద్యార్థులు

ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాఖల వారీగా స్వీకరించే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వెల్డర్ బలవన్మరణం

మొయినాబాద్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం మొయినాబాద్ మండల కేంద్రంలో వెలుగుచూసింది. ఎస్సై కిషన్‌జీ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం జొన్నాడ గ్రామానికి చెందిన మహ్మద్ మోబిన్(40) పన్నెండేళ్ల క్రితం మొయినాబాద్‌కు చెందిన పర్వీన్ ఉన్నీసాను పెళ్లి చేసుకుని ఇల్లరికం వచ్చాడు. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెల్డింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల వెల్డింగ్ పనికోసం కొంత మంది దగ్గర అడ్వాన్స్ తీసుకున్నాడు. దీంతోపాటు అప్పులు కూడా చేశాడు. అడ్వాన్స్ ఇచ్చినవారు, అప్పులు ఇచ్చిన వారు డబ్బులు తిరిగివ్వాలని అడుగుతున్నారు. మూడు రోజుల క్రితం భార్య, పిల్లలను బంధువుల ఇంట్లో శుభకార్యానికి జహీరాబాద్ పంపించాడు. అప్పు ఇచ్చిన వారు తిరిగివ్వాలని అడుగుతుండడంతో మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం భార్య, పిల్లలు ఫోన్ చేసినా స్పందించికపోవడంతో తలుపులు విరగొట్టగా ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. లోపలికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

శంకర్‌పల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని ఎల్వర్తి గ్రామానికి చెందిన జొన్నాడ హరిశంకర్(23) కొన్ని రోజుల క్రితం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో ఫొటో స్టూడియోను ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి మద్యం తాగి స్టూడియోలోనే నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో అందులోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్టూడియో కోసం చేసిన అప్పుల ఒత్తిడి ఎక్కువ కావడంతో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు

పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం

శంషాబాద్: రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం సాతంరాయిలోని అపర్ణ కన్‌స్ట్రక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనం నడిపించే వ్యక్తితో ప్రయాణిస్తున్న సహచరులు కూడా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి బయటపడే అవకాశముంటుందన్నారు. కారు డ్రైవింగ్‌లో కూడా డ్రైవర్‌తో పాటు ప్రయాణికులందరు సీటు బెల్టును ధరించాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ పోలీసులు సూచించిన నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు శాతం గణనీయంగా తగ్గుముఖం పడుతుందన్నారు.

కుర్చీ కొట్లాట!

- అవిశ్వాసం వైపు పైలెట్ వర్గం పావులు
- చైర్‌పర్సన్ రేసులో పట్లోళ్ల దీపనర్సింహులు
- మెజార్టీ కోసం అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లకు గాలం
- రసవత్తరంగా తాండూరు మున్సిపల్ రాజకీయం



తాటికొండ స్వప్న పరిమళ్, చైర్‌పర్సన్



దీపనర్సింహులు, వైస్ చైర్‌పర్సన్



తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు: మున్సిపల్ రాజకీయం మరోసారి వేడెక్కుతోంది. ఒప్పందం ప్రకారం ఇద్దరు చైర్‌పర్సన్‌లు కొనసాగాలని బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టాన నేతలు నాలుగేళ్ల క్రితం నిర్ణయించారు. దీంతో రెండున్నరేళ్ల పాటు చైర్‌పర్సన్‌గా తాటికొండ స్వప్నపరిమళ్ కొనసాగారు. గడువు ముగిసిన తర్వాత కూడా చైర్‌పర్సన్ స్వప్న పదవికి రాజీనామా చేయలేదు. వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపనర్సింహులు చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టాలని ఏడాది కాలంగా బీఆర్‌ఎస్ పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల వల్ల మున్సిపాలిటీలపై పార్టీ జోక్యం తీసుకొలేదు. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతో ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్ పదవి ఇవ్వాలని దీపనర్సింహులు డిమాండ్ చేస్తున్నారు.

సేకరించిన సంతకాలు

గతంలో పట్నం మహేందర్‌రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. పట్నం శిబిరంలో ఉన్న పలువురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో చైర్‌పర్సన్ తాటికొండస్వప్నకు మెజార్టీ కౌన్సిలర్‌లు కరువయ్యారు. అధికారప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్‌ల మద్దతులో ఎలాగైనా చైర్‌పర్సన్ తాటికొండస్వప్నపై అవిశ్వాసం ప్రవేశపెట్టి పదవి నుంచి దింపాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి వర్గీయులు సిద్ధమయ్యారు. మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 36 మంది కౌన్సిలర్‌లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానానికి నోటీసు అందించాలంటే మొత్తంలో మూడో వంతు సభ్యులు సంతకాలు పెట్టాల్సి ఉంది. ఇప్పటికే 15 మంది కౌన్సిలర్‌ల సంతకాలు సేకరించినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ముగ్గురు కౌన్సిలర్‌లు మాత్రమే ఉన్నారు. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కొందరు కౌన్సిలర్‌లు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్‌లో బలం పెరిగింది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీలో ఉన్న కౌన్సిలర్‌ల మద్దతు లభిస్తోందా.. లేదా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మరో వైపు బీజేపీ కౌన్సిలర్‌లు అవిశ్వాసం పెట్టేందుకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం.

అన్నదమ్ముల పంచాయితీ

సాయిపూర్ ప్రాంతంలో మూడు వార్డులలో ఒకే కుటుంబానికి చెందిన వారే కౌన్సిలర్‌లుగా కొనసాగుతున్నారు. దాయాదులుగా ఉన్న వారు ఒకరంటే ఒకరికీ పొసగడం లేదు. సాయిపూర్‌లోని 9వ వార్డు కౌన్సిలర్ అయిన వైస్ చైర్‌పర్సన్ దీపనర్సింహులు చైర్‌పర్సన్ పదవికోసం ఆశపడుతున్నారు. అయితే సోదరులు అయిన కౌన్సిలర్‌లు నీరజాబాల్‌రెడ్డి, పట్లోళ్ల రత్నమాలనర్సింహులు వైస్ చైరపర్సన్‌కు మద్దతు ఇవ్వడం లేదు. దీంతో అన్నదమ్ముల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

ఎమ్మెల్యేకు విషమ పరీక్ష

మున్సిపల్ అవిశ్వాస తీర్మానం విషయంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి విషమ పరీక్ష ఎదురుకానుంది. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లు అవిశ్వాస తీర్మానానికి పాల్గొనకుండా ఉంటే ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో జత కట్టారనే ప్రచారం సాగుతోంది. అవిశ్వాసంలో పాల్గొంటే కాంగ్రెస్ పార్టీలో చేరిన పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులతో విభేదాలు ఎదురవుతాయి. దీంతో అవిశ్వాసం విషయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పట్టించుకోవడం లేదంటూ పార్టీ వర్గాలు అంటున్నాయి.

తప్పిపోయిన వృద్ధురాలి అప్పగింత

మానవత్వం చాటుకున్న పోలీసులు



వృద్ధురాలిని మనవడికి అప్పగిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: మతి స్థిమితం కోల్పోయి ఇంటి నుంచి తప్పిపోయిన వృద్ధురాలిని చెరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐలు రామకృష్ణ, మైబెల్లిలు తెలిపిన వివరాల ప్రకారం.. బాలపూర్ సమీపంలోని అల్మాస్‌గూడకు చెందిన నేనవత్ చండి(70) మతిస్థిమితం కోల్పోయారు. ఇంటి నుంచి మూడు రోజుల క్రితం తప్పిపోయి తిరుగుతూ స్థానికంగా ఉప్పరిగూడ వద్దకు చేరుకున్నారు. అక్కడ రోడ్డుపై తిరుగుతుండగా సోమవారం పోలీసుల కంట పడ్డారు. కానిస్టేబుల్‌లు రాజు, ప్రేమలత ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వృద్ధురాలిని మాట్లాడించేందుకు పోలీసులు యత్నిస్తున్నా సరైన సమాధానం రాలేదు. అయితే బాలపూర్ పేరు ప్రస్తావిస్తుండటంతో అక్కడ పోలీస్‌స్టేషన్‌కు ఆమె ఫొటోలు పంపించారు. అక్కడి మొబైల్ పెట్రోలింగ్ పోలీసులు ఆమె ఫొటోలను పలువురికి చూపిస్తూ వాకబు చేయగా అల్మాస్‌గూడవాసిగా గుర్తించారు. అక్కడ ఆమె మనమడు నేనావత్ పవన్‌కు పోలీసులు ఈ విషయాన్ని తెలపడంతో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మతి స్థిమితం కోల్పోయిన వృద్ధురాలిని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చిన ఇబ్రహీంపట్నం పోలీసుల పనితీరును స్థానికులు ప్రశంసించారు.

చోరీ కేసులో రిమాండ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మున్సిపల్ ట్రాక్టర్

శంకర్‌పల్లి: పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం ఎదుట పార్కింగ్ చేసిన శంకర్‌పల్లి మున్సిపల్ ట్రాక్టర్, ట్రాలీ డిసెంబర్ 27న చోరీకి గురైంది. మున్సిపల్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ ఫుటేజీలు, టెక్నాలజీని వినియోగించి ట్రాక్టర్ ఏ ప్రాంతానికి వెళ్లిందో గుర్తించారు. వికారాబాద్ జిల్లా, యాలాల మండలం, అగ్గనూరు గ్రామానికి చెందిన గోపాల్ వాహనాన్ని తీసుకెళ్లాడని నిర్ధారించారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణను నంబర్‌వన్‌గా చేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలబెడతామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న తైక్వాండో ప్రీమియర్ లీగ్ పోటీల బహుమతుల ప్రదానోత్సవానికి సోమవారం మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా సాధికారతకు మెరుగైన విధానాలకు రూపకల్పన చేసిందన్నారు. ప్రపంచంలో మెన్, ఉమెన్ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ తైక్వాండో ప్రీమియర్ లీగ్ నగరంలో నిర్వహించడం అభినందనీయమని, క్రీడాకారులకు ఇది గొప్ప అవకాశమని తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతగా నిలిచిన క్రీడాకారులకు, కొరియన్ తైక్వాండో అధికారులతో కలిసి మంత్రి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రాండ్‌మాస్టర్ జున్‌లీ, మాస్టర్ మూన్‌కీజు, వి.ప్రవీణ్‌రెడ్డి, రాహుల్ రవిచంద్ర, ఎం.ఎస్.ఆర్.గుప్తా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, మతోన్మాద ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పాషానరహరి భవన్‌లో ఆ సంఘం మండల అధ్యక్షుడు అంకగల్ల కుమార్ అధ్యక్షతన మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పేదలు మరింత పేదలుగా మారుతున్నారని విమర్శించారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. సీఐటీ యూ మండల కన్వీనర్ బాల్‌రాజు, నాయకులు శేఖర్, సత్తయ్య, ఆర్.యా దయ్య, ఎం.యాదయ్య, జంగయ్య, జి.శ్రీకాంత్, కె.శ్రీకాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎస్పీఓ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగంలో 150 స్పెషల్ పోలీసు ఆఫీసర్ (ఎస్పీఓ) పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సంయుక్త సీపీ సత్యనారాయణ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన నియమించే ఎస్పీఓ పోస్టుకు తెలంగాణ రాష్ట్రంలోని మాజీ సైనికులు, మాజీ పారామిలిటరీ బలగాలతో పాటు మాజీ పోలీసులూ అర్హులు. మాజీ సైనికుల వయసు ఈ ఏడాది ఫిబ్రవరి 1 నాటికి 58 సంవత్సరాల కంటే తక్కువ ఉండాలి. మాజీ పారామిలటరీ, రిటైర్డ్ పోలీసు సిబ్బంది మాత్రం పదవీ విరమణ పొంది రెండేళ్ల లోపు అయి ఉండాలి. వీరి గరిష్ఠ వయో పరిమితి 61 ఏళ్లుగా నిర్ధారించారు. ఎంపికైన వారికి నెలకు రూ. 26 వేల గౌరవ వేతనం ఇస్తారు. ఎలాంటి సెలవులు వర్తించవని, పని చేసిన రోజులకు మాత్రమే చెల్లింపులు ఉంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పేట్లబురుజులోని సీఏఆర్ హెడ్-క్వార్టర్స్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.

ఆప్యాయతకు మారుపేరు జల్‌పల్లి

- ఇక్కడికి వస్తే అమ్మగారింటికి వచ్చినట్లుంటుంది
- ఎమ్మెల్యే సబితారెడ్డి



ఎంపీతో కలిసి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరైన జల్‌పల్లి మున్సిపాలిటీకి రావడం అంటే తనకు అమ్మగారింటికి వచ్చిన భావన కలుగుతుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ కట్టబెట్టిన జల్‌పల్లి మున్సిపాలిటీలో పార్టీ శ్రేణుల కోసం సోమవారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సమావేశంలో ఆమె చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ఓట్ల లెక్కింపులో జల్‌పల్లి మున్సిపాలిటీ రౌండ్ రాగానే ఇతర పార్టీల నాయకులు ఓటమి తప్పదని కౌంటింగ్ హాల్ నుంచి వెళ్లిపోయారని గుర్తు చేశారు. తన విజయం కోసం పనిచేసిన అందరి కోసం.. తాను కూడా మనసు పెట్టి పని చేస్తానని తెలిపారు. మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ తనను గెలిపించేందుకు ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో రంజిత్ రెడ్డి, హైదరాబాద్‌లో అసదుద్దీన్ ఒవైసీలను ఎంపీలుగా గెలిపించేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గతంలో నియోజకవర్గ అభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ.169 కోట్లను తిరిగి సాధించి తీరుతానని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ తప్పుడు వాగ్దానాలతో మోసపోయి మాత్రమే ఆ పార్టీకి పట్టం కట్టారన్నారు. కానీ ఆ పార్టీ ఏ ఒక్క హామీని నెరవేర్చే స్థితిలో లేదన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో రూ.200 కోట్ల అభివృద్ధి చేసిన ఘనత సబితారెడ్డికే దక్కుతుందన్నారు. పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ పాత్ర ఉండాల్సిన అవసరం ఉందని, ఈసారి ఎన్నికల్లో తనను గెలిపించాలని ఆయన కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, యూసుఫ్ పటేల్, జనార్దన్, అఫ్జల్, లక్ష్మీనారాయణ, కొండల్‌యాదవ్, అహ్మద్ సాది, ఎక్బాల్ ఖలీఫా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. గత ప్రభుత్వాలు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరిని అవలంబించాయన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్మికులు ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జంగయ్య, నాయకులు వీరేశ్, సత్యమ్మ, చంద్రయ్య, బుచ్చమయ్య, ప్రసాద్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ డిపోలో రెండు బస్సులు దగ్ధం

- దిల్‌సుఖ్‌నగర్ సిటి డిపోలో ఘటన
- కారణాలపై ఆర్టీసీ అధికారుల విచారణ

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్టీసీ డిపోలో సోమవారం ఉదయం అనుమానాస్పదంగా మంటలంటుకుని రెండు మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటా లేక మరేదైనా కారణం అయి ఉంటుందా అని ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.... ఉదయం 4.50 గంటలకు ధర్మయ్య అనే డ్రైవర్ విధుల కోసం బస్‌డిపోకు చేరుకున్నారు. తనకు కేటాయించిన బస్సు (టీఎస్04జడ్0173) వద్దకు వెళ్లి తన బ్యాగ్‌ను బస్‌లో పెట్టి తాగు నీరు తెచ్చుకునేందుకు వాటర్ ఫిల్టర్ దగ్గరకు వెళ్లాడు. బస్ బయలుదేరేందుకు 45 నిమిషాలు సమయం ఉండటంతో అక్కడే సిబ్బందితో మాట్లాడుతున్నాడు. బస్ గ్యారేజ్ ఎదురుగా పార్కు చేసి ఉన్న బస్ నుంచి పొగలు రావటం గమనించిన మెకానిక్‌లు కొందరు బస్ దగ్గరకు పరుగెత్తారు. బస్ అడుగున బ్యాటరీ, గేర్‌బాక్స్ మధ్యలో మంటలు వస్తుండటంతో ఫైర్ సేఫ్టీ సిలెండర్ తీసుకొచ్చి ఆపే ప్రయత్నించారు. కానీ ఆగక పోగా క్షణాల్లోనే బస్‌మొత్తం వ్యాపించాయి. ఈలోగా కొంత మంది మెకానిక్‌లు మంటలు అంటుకున్న బస్ పక్కన ఉన్న మూడు బస్‌లను అక్కడ నుంచి తరలించారు. ప్రమాదం జరిగిన బస్ పక్కన ఉన్న మరో బస్‌తీసేందుకు వీలు కాక పోవటంతో (టీఎస్ 04 జడ్ 0193) బస్‌కు కూడా మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. ఈలోగా సమాచారం అందుకున్న మలక్‌పేట ఫైర్ స్టేషన్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పేశారు. రెండు బస్‌లు పూర్తిగా దగ్ధం కాగా మరో గూడ్స్ వాహనం కొద్దిగా కాలింది.

ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూటేనా..?

దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపోలో రెండు బస్‌లు దగ్ధం కావటానికి కారణం షార్ట్ సర్క్యూటా లేక మరేదైన కారణం ఉందా అని అనుమానాలు కలుగుతున్నాయి. మంటలు ముందుగా అంటుకున్న బస్ చౌటుప్పల్ రూట్‌లో నడుపుతారు. గేర్ బాక్స్‌లో ప్రాబ్లం ఉండటంతో రెండు రోజులుగా నడపటం లేదని తెలిసింది. గేర్‌బాక్స్ మరమ్మత్తు పూర్తి చేసిరాత్రి 9గంటల సమయంలో బస్ వాషింగ్ చేసి పార్కు చేసినట్లు మెకానిక్‌లు తెలిపారు. బ్యాటరీ నుంచి వచ్చే వైర్లు ఏవైనా షార్ట్ అయి మంటుల వ్యాపించి గాలి ఎక్కువగా ఉండటంతో పక్కన ఉన్న బస్‌కూడా దగ్ధం అయిందని అధికారులు తెలువుతున్నారు. బస్‌లో తన బ్యాగ్ పెట్టి వాటర్ కోసం వెళ్లానని డ్రైవర్ ధర్మయ్య తెలుపుతుండగా మంటలు అంటుకున్న సమయంలో బస్ స్టార్టింగ్ అన్ చేసిఉందని కొంతమంది డిపో సిబ్బంది చెప్పటం గమనార్హం. టీఎస్ఆర్‌టీసీ ప్రధాన కార్యాలయం నుండి పలువురు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనపై మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో డిపో మేనేజర్ హరి ఫిర్యాదు చేశారు.



కాలిపోయిన బస్సును పరిశీలిస్తున్న టీఎస్ ఆర్‌టీసీ ఈడి వెంకటేశ్వర్లు, ఆర్ఎం వరప్రసాద్ తదితరులు

వైస్ చైర్మన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ భూ కబ్జా చేశాడంటు పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్ యాదవ్‌లు సోమవారం జిల్లా కలెక్టర్ శశాంకకు ఫిర్యాదు చేశారు. మహిళకు సంబంధించిన భూమిని కబ్జా చేయడంతో పాటు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. భూ కబ్జాపై సమగ్ర రెవిన్యూ సర్వే చేయించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నేతల వినతి మేరకు వెంటనే సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు.

ఉత్తర ద్వారం నుంచి వచ్చి ఆలయ హుండీ చోరీ

వెంగళరావునగర్: ఆలయంలోకి ఉత్తర ద్వారం గుండా ప్రవేశించి హుండీని చోరీ చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని భూనేల సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఈ నెల 19న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు శుభ్రం చేస్తున్నారు. 22న ఆయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఆలయం మొత్తం శుభ్రం చేశారు. ఈ క్రమంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉండాల్సిన హుండీ మాయం అయింది. సీసీ టీవీ ద్వారా పరిశీలించగా ఆగంతకుడు ఉత్తర ద్వారం గుండా ప్రవేశించి దొంగిలించినట్లు కనుగొన్నారు. హుండీలో దాదాపు రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. నిందితుడి కోసం అనేక ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేదు. దాంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌పై వేటు

చైతన్యపురి: చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన నాగార్జునపై వేటు పడింది. వారంట్ విషయంలో నిందితుడి నుంచి డబ్బు వసూలు చేశారని అయిదు రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌కు చెందిన ముగ్గురు కానిస్టేబుళ్ల ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఇన్‌స్పెక్టర్ అడ్మినిస్ట్రేషన్‌లో విఫలం అయినట్లు భావించిన రాచకొండ సీపీ ఆయనను మల్టీ జోన్-2కి అటాచ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. అయితే చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

డిస్కం సెక్యూరిటీ ఓఎస్‌డీ రాజీనామా

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సెక్యూరిటీ ఓఎస్‌డీ, మాజీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కొండారి మురళీధర్‌రావు తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాల రీత్యా విధుల నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీకి రాజీనామా లేఖను అందజేసినట్లు తెలిసింది.

యువకుడి దారుణ హత్య

మల్కాజిగిరి: యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ, ఎస్‌ఐ సతీష్‌లు తెలిపిన మేరకు.. ఒరిస్సాకు చెందిన బొల్లు బిసాయి(30) అదే ప్రాంతానికి చెందిన ఆరుగురితో కలిసి ఉప్పరిగూడ పిట్టలబస్తీలో నివాసం ఉంటున్నాడు. అందరూ సెంట్రింగ్ కార్మికులుగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం పనికి వెళ్లిన అతని స్నేహితులిద్దరూ సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి బొల్లు బిసాయి రక్తపు మడుగులో తలపై గాయాలై చనిపోయి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం వరకు స్నేహితులతో పార్టీ చేసుకున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మిగిలిన స్నేహితులు కనిపించకపోవడంతో పోలీసులు వారిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.